# కృతజ్ఞతా భావం గురించి
# హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఆచరణాత్మక ఆదర్శం మరియు వారి (అ) బోధనలు

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 14.08.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. గత ఖుత్బాలలో కృతజ్ఞత వ్యక్తం చేయడానికి సంబంధించి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి బోధనలు, ఉత్తమ ఆదర్శాన్ని వివరించడం జరిగింది. కృతజ్ఞతపు ఈ ఉన్నతమైన ప్రమాణాన్ని వారి సత్యదాసుడు, ఈ యుగపు ఇమామ్ అయిన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఏ విధంగా అర్థం చేసుకున్నారు, తన ఆచరణ ద్వారా ఇంట్లో పిల్లలకు ఎలా అవగాహన కల్పించారనే విషయానికి సంబంధించి కొన్ని ఆధారాలను సమర్పింతును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం దైవానుగ్రహాలకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపడంలోని ప్రాముఖ్యతను, అంతరార్థాన్ని వివరిస్తూ ఇట్లన్నారు: మనిషి ఏదైనా ఉన్నతమైన పదవిని లేదా స్థానాన్ని పొందినప్పుడు అహంకారిగా మారిపోతాడు. వాస్తవానికి ఆ సమయంలో అతను ఎన్నో మంచి పనులు చేయవచ్చు, మానవాళికి మేలు చేకూర్చవచ్చు. అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇట్లన్నాడు: لَئِنْ شَكَرْتُمْ لَأَزِيْدَنَّكُمْ అనగా మీరు నా పట్ల కృతజ్ఞత కలిగి ఉంటే, నేను నా అనుగ్రహాలను ఇంకా పెంచుతాను. కానీ మీరు అకృతజ్ఞతకు పాల్పడితే, నా శిక్ష చాలా తీవ్రమైనది. అనగా మనిషిపై అల్లాహ్ అనుగ్రహాలు ఉన్నప్పుడు, అతను దేవునికి కృతజ్ఞతలు అర్పించాలి, మానవాళి శ్రేయస్సును కాపాడాలి. అలా కాకుండా ఎవరైనా దీనికి విరుద్ధంగా ప్రవర్తించి, అన్యాయం చేయడం ప్రారంభిస్తే, అల్లాహ్ తఆలా ఆ అనుగ్రహాలను వారి నుండి తిరిగి తీసివేసి తన శిక్షను పంపుతాడు.

తర్వాత వారు (అ) ఇట్లన్నారు: అన్నింటికంటే ముందుగా మనకు జీవితాన్ని, ఆరోగ్యాన్ని, క్షేమాన్ని, శాంతిని ప్రసాదించి, ధర్మ ప్రచారానికి అవసరమైన మార్గాలను సమకూర్చిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపాలి. నిజానికి సత్యమైన విషయం ఏమిటంటే, మనం అల్లాహ్ అనుగ్రహాలకు కృతజ్ఞతలు తెలపాలనుకుంటే, ఆ దేవుని దయ, కరుణలను, ఉపాకారాలను లెక్కించడం ఎంతమాత్రమూ సాధ్యం కాదు.

తర్వాత మరొక సందర్భంలో వారు (అ) ఇట్లన్నారు: ముస్లింలు అల్లాహ్ తఆలాకు ఎంతో కృతజ్ఞత కలిగి ఉండవలెను. ఎందుకంటే అతను వారికి జ్ఞానపరంగా, ఆచరణాత్మకంగా ప్రతి విధమైన పీడనం, అసహ్యకరమైన విషయాలు, అన్ని రకాల లోపాల నుండి పవిత్రమైన ఒక ధర్మాన్ని ప్రసాదించాడు. మనిషి గనుక ఆలోచించి, పరిశీలిస్తే నిజంగా అన్ని రకాల ప్రశంసలకు, గుణగణాలకు అర్హుడు అల్లాహ్ తఆలా మాత్రమేనని, ఏ మానవుడు లేదా ఏ సృష్టి కూడా నిజమైన, వాస్తవమైన అర్థంలో ప్రశంసలకు అర్హులు కారని అతనికి అర్థమవుతుంది. మనిషి ఎటువంటి స్వార్థం లేక నిష్పక్షపాతంగా చూస్తే, ప్రశంసలకు అర్హుడిగా పరిగణించబడే ఏ వ్యక్తి అయినా ఈ క్రింది కారణాల వల్లే అర్హుడు కాగలడని అతనికి స్పష్టంగా తెలిసిపోతుంది: ఏ ఉనికి లేని, ఏ ఉనికి గురించిన సమాచారం కూడా లేని కాలంలో అతడు దానిని సృష్టించినవాడై ఉండటం లేదా ఏ ఉనికి లేని, ఉనికికి, ఉనికి మనుగడకు, ఆరోగ్య పరిరక్షణకు, జీవనానికి ఏ ఏ సాధనాలు అవసరమో తెలియని కాలంలో అతడు ఆ సాధనాలన్నింటినీ

సమకూర్చి ఉండటం లేదా అతనిపై ఎన్నో ఆపదలు రాగల కాలంలో అతను దయచూపి, అతనిని సురక్షితంగా కాపాడి ఉండటం లేదా కష్టపడి పనిచేసేవారి కష్టాన్ని వృథా పోనివ్వకుండా, వారి హక్కులను పూర్తిస్థాయిలో చెల్లించడం వల్ల ప్రశంసకు అర్హుడు కావడం. ఉపాధి లేదా కూలీ ఇచ్చేటప్పుడు హక్కులను చెల్లించడం అనేది ప్రతిఫలమే అయినప్పటికీ, హక్కులను పూర్తిస్థాయిలో చెల్లించే వ్యక్తి కూడా ఉపకారి కాగలడు. ఇవి ఒకరిని ప్రశంసలకు అర్హుడిగా చేసే అత్యున్నతమైన గుణాలు. ఇప్పుడు ఆలోచించి చూడండి. వాస్తవానికి ఈ ప్రశంసలన్నింటికీ అర్హుడు కేవలం అల్లాహ్ తఆలా మాత్రమే, అతను మాత్రమే పరిపూర్ణంగా ఈ గుణగణాలను కలిగి ఉన్నాడు. మరే ఇతర సృష్టిలోనూ ఈ గుణాలు లేవు. తర్వాత ఇస్లాం పునరుజ్జీవనం, అహ్మదియ్యా సంస్థ స్థాపనపై అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలుపవలసిన అవసరాన్ని గుర్తుచేస్తూ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇట్లన్నారు: ఓ బుద్ధిమంతులారా! ఈ అవసరమైన సమయంలో, అత్యంత గాఢమైన అంధకారపు రోజులలో అల్లాహ్ తఆలా ఒక దివ్యమైన వెలుగును అవతరింపజేసి, మానవాళి శ్రేయస్సు కోసం ఒక సేవకుని ప్రత్యేకం చేసి, ఇస్లాం పతాకాన్ని ఎగురవేయడానికి, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాంతిని వ్యాప్తి చేయడానికి, ముస్లింలకు తోడ్పడటానికి, వారి ఆంతరంగిక రంగాన్ని పవిత్రం చేసే ఉద్దేశంతో ఈ లోకానికి పంపినందుకు మీరు ఆశ్చర్యపోకండి.

ఆశ్చర్యపోవాల్సింది దేనికంటే పవిత్ర ఖుర్ఆన్ బోధనలకు నేను ఎల్లప్పుడూ సంరక్షకుడిగా ఉంటానని, దానిని చల్లబడనివ్వనని, శోభ రహితంగా, వెలుగు లేకుండా కానివ్వనని ఇస్లాం ధర్మానికి రక్షకుడైన అల్లాహ్ వాగ్దానం చేసి ఉండెను. అలాంటి దేవుడు ఈ అంధకారాన్ని చూసి, బాహ్యాంతర అలజడులను చూసి మౌనంగా ఉండి పోవడం, తన పవిత్ర గ్రంథంలో బలంగా పేర్కొన్న వాగ్దానాన్ని గుర్తుంచుకోకపోవడం అనేది నిజంగా ఆశ్చర్యకరమైన విషయం అయ్యేది. నేను మళ్లీ చెబుతున్నాను ఒకవేళ ఆశ్చర్యపడటానికి ఏమైనా కారణం ఉండి ఉంటే, అది పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి స్పష్టమైన భవిష్యవాణి విఫలమవడం అయ్యేది. ప్రతి శతాబ్దం ప్రారంభంలో అల్లాహ్ తఆలా తన ధర్మాన్ని పునరుద్ధరించే ఒక సేవకుని పుట్టిస్తూనే ఉంటాడని ఆ భవిష్యవాణిలో పేర్కొనబడింది. కాబట్టి ఇది ఆశ్చర్యపడే సమయం కాదు, వేల సార్లు కృతజ్ఞతలు తెలుపుకోవాల్సిన సమయం, విశ్వాసాన్ని, నమ్మకాన్ని పెంచుకోవాల్సిన సమయం. ఎందుకంటే అల్లాహ్ తఆలా తన దయ, కృపతో తన వాగ్దానాన్ని నెరవేర్చాడు, తన ప్రవక్త భవిష్యవాణిలో ఒక్క నిమిషం కూడా తేడా రానివ్వలేదు. కేవలం ఆ భవిష్యవాణిని నెరవేర్చడమే కాకుండా, రాబోయే కాలం కోసం వేలాది భవిష్యవాణులకు, అద్భుతాలకు తలపులను తెరిచాడు. మీరు విశ్వాసులైతే కృతజ్ఞతలు తెలపండి, కృతజ్ఞతా పూర్వక సాష్టాంగ ప్రణామాలు చేయండి! ఎందుకంటే మన పెద్దలు, పూర్వీకులు, ఎందరో సత్యవంతులు దేని కోసం వేచి చూస్తూ, ఏ కాలపు నిరీక్షణలో పయనించి వెళ్లిపోయారో, ఆ కాలాన్ని మీరు పొందారు. ఇప్పుడు దాని విలువ తెలుసుకోవడం లేదా తెలుసుకోకపోవడం, దాని నుండి ప్రయోజనం పొందడం లేదా పొందకపోవడం అనేది మీ చేతుల్లోనే ఉంది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. వారు అల్లాహ్ తఆలాకు కృతజ్ఞత కలిగి ఉంటూ, అతను పంపిన ఇమామ్‌ను విశ్వసించి, కష్టాల నుండి రక్షించబడటానికి తమను తాము ఐక్యత అనే ఒకే దారంలో అల్లుకోవడమే నేటి ముస్లింల బాధ్యత. సత్యాన్వేషిని సంబోధిస్తూ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా ఉపదేశించారు: అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపండి; ఎందుకంటే అతను సరైన సమయంలో సహాయం అందించి ఈ సంస్థను స్థాపించాడు. కాబట్టి మీకు అనుగ్రహించబడిన ఈ కృపను మీరు వృథా చేసుకోకపోవడం, గౌరవప్రదమైన దృష్టితో చూడటం, మీకు లభించిన ఈ సహాయం, తోడ్పాటు విలువను గుర్తించడం శ్రేయస్కరం. అల్లాహ్ తఆలా పంపిన వ్యక్తిని ప్రజలు గుర్తుపట్టడం అనేది అతని ప్రత్యేకమైన కృప. కాబట్టి మీకు ఈ సామర్థ్యాన్ని ప్రసాదించడం, ఆ గుర్తుపట్టే కన్నును అనుగ్రహించడం అనేది మీపై అల్లాహ్ తఆలా చేసిన చాలా పెద్ద ఉపకారం.

తర్వాత వారు (అ) మియాఁ అబ్దుల్ హఖ్ గారి ఉదాహరణను పేర్కొన్నారు. అల్లాహ్ తఆలా ఏ విధంగా ఆయనకు తోడ్పడి, ఐహిక ఐశ్వర్యాల నుండి బయటకు తీసుకువచ్చి సత్యాన్ని స్వీకరించే భాగ్యాన్ని ప్రసాదించాడో వివరించిరి. హజ్రత్ మియాఁ అబ్దుల్ హఖ్ గారు కసూర్ నివాసి. ఆయన విద్యార్థిగా ఉన్నప్పుడు క్రైస్తవ మతాన్ని

స్వీకరించారు. తర్వాత హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి కొన్ని రచనలను చదివి ఇస్లాం సత్యతను, నిజాయితీని ఆచరణాత్మక రూపంలో చూడాలనుకుంటున్నానని తెలుపుతూ హుజూర్ గారికి లేఖ రాశారు. కనీసం రెండు నెలల పాటు ఖాదియాన్‌కు వచ్చి ఉండాలని హుజూర్ (అ) ఆయనకు సూచించారు. దాని ప్రకారం ఆయన రావడానికి నిర్ణయించుకున్నారు. చాలా మంది ఆయనను అడ్డుకొని ఖాదియాన్‌కు వెళ్లవద్దని హితవు పలికారు. ఒక వ్యక్తి అయితే దూషించాడు కూడా. అయినప్పటికీ ఆ విషయాలన్నిటిపై దైవకృప గెలిచి, ఆయనను ఇక్కడికి ఆకర్షించి తీసుకువచ్చింది.

అహ్మదియ్య సంస్థలో చేరిన వారి నిష్కల్మషమైన ప్రేమ, ఆత్మీయతలను ప్రస్తావిస్తూ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా ఉపదేశించారు: అల్లాహ్ తఆలా తన దయ, కృపతో నన్ను ఒంటరిగా విడిచిపెట్టలేదనే విషయాన్ని వ్యక్తీకరించకుండా, దానికి కృతజ్ఞతలు తెలుపకుండా నేను ఉండలేకపోతున్నాను. నాతో సహోదరత్వ సంబంధాన్ని ఏర్పరుచుకుని, అల్లాహ్ తఆలా స్వయంగా తన చేతులతో స్థాపించిన ఈ సంస్థలో చేరిన వారు అత్యంత విచిత్రమైన రీతిలో ప్రేమ, నిష్కపటమైన రంగుతో రంగులద్దబడి ఉన్నారు. నేను నా కష్టంతో కాదు, అల్లాహ్ తఆలా తన ప్రత్యేక ఉపకారంతో సత్యంతో నిండిన ఈ ఆత్మలను నాకు ప్రసాదించాడు. అందరికంటే ముందుగా నా ఒక ఆధ్యాత్మిక సోదరుని గురించి ప్రస్తావించడానికి నా హృదయంలో ఒక ఉత్సాహం ఉప్పొంగుతోంది. వారి నిష్కల్మషమైన వెలుగు లాగే వారి పేరు కూడా 'నూరుద్దీన్'. ఇస్లాం పతాకాన్ని ఎగురవేయడానికి వారు తమ ధర్మబద్ధమైన ధనాన్ని ఖర్చు చేస్తూ అందిస్తున్న కొన్ని ధార్మిక సేవలను నేను ఎల్లప్పుడూ ఆరాటంతో కూడిన దృష్టితో చూస్తుంటాను. అయ్యో! ఆ సేవలు నా ద్వారా కూడా నెరవేరితే ఎంత బాగుండేది! అని భావిస్తుంటాను. ఓ సర్వలోకాల ప్రభువా! నీ అనుగ్రహాలకు నేను కృతజ్ఞతలు తెలుపలేను. నీవు అత్యంత దయామయుడవు, కృపాశీలుడవు, నాపై నీ ఉపకారాలు అపారమైనవి. నా పాపాలను క్షమించు, నేను నాశనం కాకుండా కాపాడు. నాకు (ఆధ్యాత్మిక) జీవనం లభించేలా నా హృదయంలో నీ ప్రత్యేక ప్రేమను నింపు. నా లోపాలను కప్పిపుచ్చు మరియు నీవు ప్రసన్నుడవయ్యే ఆచరణలను నా ద్వారా చేయించు. నీ కోపం నాపై పడకుండా నీ పవిత్రమైన సద్గుణాల ద్వారా నీ శరణు కోరుతున్నాను. దయ చూపు. ఈ లోకంలోనూ, పరలోకంలోనూ వచ్చే ఆపదల నుండి నన్ను రక్షించు. ఎందుకంటే ప్రతి దయ మరియు కృప నీ చేతిలోనే ఉంది. ఆమీన్ సుమ్మ ఆమీన్.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇంకా ఇట్లు ప్రవచించారు: ఈ సందర్భంలో నేను ఒక కృతజ్ఞతను వ్యక్తం చేయకుండా ఉండలేకపోతున్నాను. అల్లాహ్ తఆలా మన దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి మద్దతుగా తన దివ్యవాణి ద్వారా అవిశ్వాసులను నిందిస్తూ ఇట్లనెను. నా ఈ ప్రవక్త ఎంతటి ఉన్నతమైన సద్గుణ సమన్వితుడైన సద్గుణాలు కలిగినవారంటే ఆయన గడిపిన నలభై సంవత్సరాల గత జీవితంలో ఏ ఒక్క లోపాన్ని గానీ, మచ్చను గానీ ఎత్తిచూపే శక్తి మీకు లేదు; ఆయన ఆ నలభై ఏళ్ల పాటు రేయింబవళ్లు మీ మధ్యనే నివసించినప్పటికీ! అలాగే, శ్రేష్ఠత, పవిత్రత, గౌరవం, నాయకత్వానికి పేరుగాంచిన ఆయన ఉన్నతమైన వంశంలో ఒక్క రవ్వంత లోపాన్ని కూడా మీరు చూపలేరు. కాబట్టి ఆలోచించండి! అంతటి శ్రేష్ఠమైన, అత్యంత పవిత్రమైన, ఉన్నతమైన వంశానికి చెందిన వ్యక్తి, మీ కళ్ల ముందే గడిచిన ఆయన నలభై ఏళ్ల జీవితం ఆయన నిందలు వేసేవాడు లేదా అబద్ధాలు చెప్పేవాడు కాదని సాక్ష్యమిస్తుంటే, ఈ సద్గుణాలతో పాటు ఆయన ఆకాశసంబంధమైన సూచనలను చూపుతున్నప్పుడు, అల్లాహ్ తఆలా సహాయం ఆయనతో ఉన్నప్పుడు, మీ విశ్వాసాలు పూర్తిగా అపవిత్రంగా, కల్తీగా, అన్యారాధనతో నిండి ఉన్న తరుణంలో ఆయన తీసుకొచ్చిన బోధనలతో పోలిస్తే ఇన్ని ఆధారాల తర్వాత ఈ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సత్యవంతుడనే విషయంలో మీకు ఇంకా ఏమి సందేహం మిగిలి ఉంది?

సరిగ్గా అదే రీతిలో, అల్లాహ్ తఆలా నా వ్యతిరేకులను, నన్ను తిరస్కరించేవారిని కూడా నిందించెను. బరాహీనె అహ్మదియ్య పుస్తకం 512వ పుటలో నా గురించి ఒక దైవవాణి ఉంది. దీనిని ప్రచురించి ఇరవై ఏళ్లు గడిచాయి. అది ఏమిటనగా فَقَدْ لَبِثْتُ فِيكُمْ عُمُرًا مِّنْ قَبْلِهِ ۗ أَفَلَا تَعْقِلُونَ అనగా: ఈ వ్యతిరేకులతో చెప్పు నేను దీనికి ముందు నలభై ఏళ్ల పాటు మీ మధ్యనే నివసించాను. ఈ సుదీర్ఘ కాలంలో నా పని నిందలు వేయడం లేదా అబద్ధాలు ఆడటం కాదని, అల్లాహ్ నన్ను అపవిత్రమైన జీవితం నుండి సురక్షితంగా కాపాడాడని మీరు నన్ను

చూస్తూనే ఉన్నారు కదా, ఇప్పటికైనా మీరు గ్రహించరా?.

హుజూర్ అలైహిస్సలాం తమ ఇంట్లోని పిల్లలలో కూడా కృతజ్ఞతా భావాలను పెంపొందించడానికి ప్రయత్నించే వారు. ఒక కథనం ఇలా ఉంది: ఒకసారి వారింట్లో పిల్లలకు ఒక కథ చెప్పారు. ఒక బట్టతల కలిగిన వ్యక్తి మరియు ఒక అంధుడు ఉండెను. అల్లాహ్ వారి వద్దకు ఒక దేవదూతను పంపాడు. దేవదూత ఆ బట్టతల వ్యక్తిని నీకేమి కావాలి? అని అడిగాడు. దానికి అతను నా తలపై వెంట్రుకలు రావాలి, నాకు ధనసంపదలు లభించాలని కోరాడు. దేవదూత అతని తలపై చెయ్యి నిమరగానే అతనికి వెంట్రుకలు వచ్చాయి మరియు సంపద లభించింది. తరువాత దేవదూత అంధుని వద్దకు వచ్చాడు. నీకేమి కావాలి? అని అడిగారు. దానికి అతను నాకు చూపు రావాలి, నాకు ధనసంపదలు లభించాలని కోరాడు. దేవదూత అతనిపై చెయ్యి నిమరగానే అతని దృష్టి తిరిగి వచ్చింది మరియు అతనికి కూడా ధనసంపదలు లభించాయి. కొంతకాలం తర్వాత అల్లాహ్ తఆలా వారిని పరీక్షించడం కోసం దేవదూతను మళ్లీ ఒక పేదవాడి రూపంలో పంపాడు. దేవదూత వెళ్లి ఆ బట్టతల వ్యక్తిని సహాయం కోరగా, అతను కోపంగా, దురుసుగా సమాధానమిస్తూ తోసిపుచ్చాడు. పో, నీలాంటి భిక్షగాళ్లు ఎంతోమంది తిరుగుతుంటారని అన్నాడు. దేవదూత అతని తలపై చెయ్యి నిమరగానే అతను మళ్లీ బట్టతల వాడిగా మారిపోయాడు, అతని సంపదంతా పోయింది. తరువాత దేవదూత ఆ అంధుని వద్దకు వచ్చి సహాయం కోరాడు. దానికి ఆ అంధుడు ఇదంతా అల్లాహ్ తఆలా ఇచ్చిందే, ఇది అతని సంపదే, నీవు ఎంతైనా తీసుకో అన్నాడు. అప్పుడు అల్లాహ్ అతనికి ఇంకా ఎక్కువ సంపదను ప్రసాదించాడు. కాబట్టి ప్రియమైన పిల్లలారా! మీరు కూడా గుర్తుంచుకోండి! అల్లాహ్ తఆలా ప్రసాదించిన అనుగ్రహాలకు కృతజ్ఞతలు తెలుపండి, వాటి విలువను గుర్తించండి మరియు సహాయం కోరి వచ్చిన వారిని తోసిపుచ్చకండి. దానధర్మాలు చేయడం మంచి విషయం, అడిగిన వారికి ఇవ్వవలెను. దీనివల్ల దేవుడు సంతోషిస్తాడు మరియు అనుగ్రహాలను ఇంకా పెంచుతాడు.

తర్వాత మరొక సందర్భంలో వారు అలైహిస్సలాం హజ్రత్ మౌల్వీ నూరుద్దీన్ రజియల్లాహు అన్హు గారి గురించి మాట్లాడుతూ ఇలా ఉపదేశించారు: హజ్రత్ హకీమ్ మౌల్వీ గారు అల్లాహ్ తఆలా అనుగ్రహాలలో ఒక అనుగ్రహం. వారి ద్వారా ఎంతోమంది పేదలకు వైద్యం అందుతోంది. వైద్యం అనేది ఇతరులకు జరుగుతోంది, కానీ వారు మానవాళికి సేవ చేస్తున్నారు, మానవులకు మేలు జరుగుతోందని హుజూర్ అలైహిస్సలాం స్వయంగా దేవునికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు!

ఖుత్బా ముగింపులో హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా ఇటీవల పరమపదించిన పలువురు మృతుల గురించి ప్రస్తావించారు. (1) గౌ!! హఫీజ్ షహ్‌బాజ్ అహ్మద్ గారు: మురబ్బీ సిల్‌సిలా ఐవరీ కోస్ట్. (2) గౌ!! యిల్నింగానా మోమినీ గారు: బుర్కినా ఫాసో షహీద్/అమరవీరుడు. (3) గౌ!! యహ్యా సోమారీ గారు: మాలి షహీద్/అమరవీరుడు. (4) గౌ!! సిరాజుల్ హఖ్ ఖురేషీ గారు: నాయిబ్ అఫ్సర్ జల్సా సాలానా రబ్వా. (5) గౌ!! లావాల్ తయ్యిబ్ గారు: ముఅల్లిమ్ సిల్‌సిలా, నైజీరియా. (6) గౌ!! మాస్టర్ గఫూర్ అహ్మద్ గారు: సాంగ్లా / కెనడా. హుజూరె అన్వర్ వారి సేవలను, మంచి పనులను ప్రశంసిస్తూ వారి ఉన్నత శ్రేయస్సు మరియు క్షమాపణ కొరకు అల్లాహ్ తఆలాను వేడుకున్నారు.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا ۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ ۔ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ ۔